క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలో 11 కేవీ విద్యుత్ లైన్ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. మిర్యాలగూడ రోడ్డు, ప్రకాశం బజార్, మాన్యంచెల్క ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

డాక్టరేట్ పొందిన వ్యక్తికి సన్మానం

తిప్పర్తి : ఇటీవల అటామర్ ఇంటర్నేషనల్ థియోలాజికల్ యూనివర్సిటీ నుంచి కాశివారిగూడెం గ్రామానికి చెందిన ఎస్‌కే కలీం డాక్టరేట్ పట్టా పొందారు. దీంతో సోమవారం ఆయనను కాశివారిగూడెం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే అబ్దుల్ రహీం, లతీఫ్, బషీర్, షరీఫ్, ముస్తఫా, రసూల్ పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణకు ..

నల్లగొండ టౌన్ : బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణను రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. బీసీ సంక్షేమ సంఘాన్ని జిల్లాలో బలోపేతం చేయాలని సూచించారు.

అంజయ్యకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న అంజయ్య

కనగల్ : పుడమి సాహితీ వేదిక తెలంగాణ 6వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని బండమీదిగూడెం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త బండమీది అంజయ్య జాతీయ విశిష్ట సేవా పురస్కారాన్ని చిలుముల బాల్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. పుడమి సాహితీ వేదిక ఖమ్మం, మానవ హక్కుల ప్రజా పరిరక్షణ సమితి–ఖమ్మం సంయుక్త ఆధ్వర్యంలో ఈ అవార్డు అందజేశారు.

దుప్పట్ల పంపిణీ

నల్లగొండ టూటౌన్ : పట్టణం రామగిరిలోని మదర్ థెరిస్సా ఆశ్రమంలో అనాథలకు బిషప్ ఘనదమన్‌కుమార్ సోమవారం దుప్పట్లు అందజేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఫాదర్ చిన్నప్పరెడ్డి, ఫాదర్ అల్లారెడ్డి, ఫాదర్ కార్తీక్, పసల శౌరయ్య, ప్రసాద్, సిస్టర్లు రమ్య, హెలిన్‌మేరి పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి..

నార్కట్‌పల్లి : మండలంలోని అమ్మనబోలు హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ జీవిత బీమా ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఐపీఎం జెఎఫ్ లయన్ రేపాల మదన్‌మోహన్, క్లబ్ ప్రెసిడెంట్ దారం వెంకన్న, సెక్రటరి దేశగాని కృష్ణయ్య, ట్రెజరర్ అంజయ్య, సత్యనారాయణ, పృథ్వీరాజ్, పిచ్చయ్య, ప్రధానోపాధ్యాయుడు శేఖర్‌రెడ్డి, విజయ్‌కుమార్, శ్రీనివాస్, ప్రకాష్, శారద, అనురాధ పాల్గొన్నారు.


గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో ఇరవై ఏళ్లుగా నిర్వహిస్తున్న గ్రంథాలయానికి హైదరాబాద్‌లో 37వ బుక్ ఫెయిర్ ముగింపు సందర్భంగా ఆ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు యాకూబ్ సోమవారం 250 పుస్తకాలను గ్రంథాలయ అధ్యక్షుడు అనుముల శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో బుక్ ఫెయిర్ కార్యదర్శి ఆర్.వాసు, కోశాధికారి పి.నారాయణరెడ్డి, ఆందోజు నాగభూషణం పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

నార్కట్‌పల్లి : ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని తహసీల్దార్ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని అక్కెనపల్లి గ్రామం ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పాల్గొని దళితులకు ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కుల వివక్ష, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. ఆర్ఐ తరుణ్, పంచాయతీ కార్యదర్శి జానకమ్మ పాల్గొన్నారు.

'కన్నీళ్లు నవ్వాయి' కథకు ద్వితీయ బహుమతి



బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి జెడ్పీహెచ్ఎస్‌లో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పెరుమాళ్ల ఆనంద్ రచించిన 'కన్నీళ్లు నవ్వాయి' కథ టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కథల పోటీల్లో ద్వితీయ బహుమతికి ఎంపికైంది. నల్లగొండలో సోమవారం టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల్లో కథా రచయిత ఆనంద్‌కు నగదు బహుమతితోపాటు జ్ఞాపికను ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అందజేశారు.

ముమ్మరంగా బీటీ రోడ్ల నిర్మాణం

- మునుగోడు, చండూరు మండలాల్లో 20 రోడ్లకు నిధులు మంజూరు
- కల్వర్టుల నిర్మాణం, రోడ్ల పక్కన చెట్ల తొలగింపు పనులు పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



నిర్మాణంలో ఉన్న గుండ్లోరిగూడెం బీటీ రోడ్డు



బీరెల్లిగూడెం రోడ్డు మార్గంలో నూతనంగా నిర్మించిన కల్వర్టును పరిశీలిస్తున్న అధికారులు

మునుగోడు: మండల వ్యాప్తంగా బీటీ రోడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. దాదాపు 15 ఏళ్లుగా తమ గ్రామాలకు పక్కా రోడ్లు నిర్మించాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు ప్రజలు అనేకమార్లు వినతులు అందించారు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు పనులు చేయలేదు. తీరా పదవీ కాలం ముగిసే సమయంలో ప్రజాప్రతినిధులు పక్కా రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు ప్రకటించి శంకుస్థాపనలు చేశారు. అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో ఏ ఒక్క పని కూడా ప్రారంభించలేదు. దీంతో మంజూరైన నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. ప్రస్తుత మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గతంలో మంజూరైన రోడ్లతోపాటు మరికొన్ని గ్రామాల రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. నాలుగు నెలల క్రితం పనులు ప్రారంభించగా ప్రస్తుతం ఆ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

20 రోడ్లకు రూ.35.76 లక్షలు..

గ్రామీణ ప్రాంతాల రహదారుల నిర్మాణ(కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ రోడ్) నిధుల నుంచి మునుగోడు సబ్ డివిజన్ పరిధిలోని మునుగోడు, చండూరు మండలాల్లోని 20 రోడ్ల నిర్మాణానికి రూ.35.76 లక్షల నిధులను గత ఏప్రిల్ మాసంలో ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ నిధులతో 39.77 కిలోమీటర్ల రోడ్లు నిర్మించాల్సి ఉంది. మునుగోడు మండలంలో 11 రోడ్లు, చండూరు మండలంలో 9 రోడ్లు మంజూరయ్యాయి. పనులు చేసేందుకు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు నాలుగు నెలల క్రితం రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. మునుగోడు మండలంలోని కల్వకుంట్ల నుంచి వెల్మకన్నె రోడ్డు పనులు తప్ప మిగిలిన 19 పనులు మొదలుపెట్టి కల్వర్టుల నిర్మాణం, రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లను తొలగించడంతోపాటు సైడ్ మట్టిని సైతం పోశారు. మునుగోడు మండలంలోని గుండ్లోరిగూడెం రోడ్డు పనులు 80 శాతం పూర్తిచేశారు. బీటీ వేయాల్సి ఉంది. ఆలస్యమైనా తమ గ్రామాలకు రోడ్లు మంజూరై ఆ పనులు వేగంగా కొనసాగుతుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

80 శాతం పనులు పూర్తి చేశారు



మా గ్రామానికి బీటీ రోడ్డు లేకపోవడంతో ఎంతో కాలంగా ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించాం. గత ప్రభుత్వం హయాంలో శిలాఫలకం వేసి పనులు చేపట్టలేదు. ఈ విషయాన్ని ప్రస్తుత ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తే తిరిగి నిధులు మంజూరు చేయించారు. వెంటనే పనులు ప్రారంభించి దాదాపు 80 శాతం పూర్తి చేశారు. మా గ్రామానికి రోడ్డు వేసేందుకు ఎమ్మెల్యే చేసిన కృషి ఎప్పటికీ మరువలేము.

–జంగిలి నాగరాజు, గుండ్లోరిగూడెం

19 రోడ్ల పనులు మొదలయ్యాయి



సీఆర్ఆర్ నిధుల నుంచి 20 పనులకు రూ.35.76 లక్షల నిధులు మంజూరు కాగా.. ఒకటి మినహా 19 పనులు మొదలయ్యాయి. మునుగోడు మండలంలోని 11 గ్రామాలకు రూ.18.65 లక్షలతో 20.77 కిలో మీటర్ల రోడ్లు, చండూరు మండలంలోని 9 గ్రామాలకు రూ.17.11 లక్షలతో 19 కిలో మీటర్ల బీటీ రోడ్లు వేయాల్సి ఉంది. ఇప్పటికే మెజార్టీ గ్రామాల్లో రోడ్ల వెంట కంపచెట్లు తొలగించడంతో పాటు కల్వర్టుల నిర్మాణం పూర్తి చేయించాం. మరికొన్ని రోడ్లకు కంకర కూడా వేయించాం. నిర్ణీత సమయానికి రోడ్ల నిర్మాణం పూర్తి చేయిస్తాం.

–నాగేశ్వర్‌రావు, డీఈ, మునుగోడు

బాధిత కుటుంబానికి మంత్రి ఆర్థికసాయం



తిప్పర్తి : బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

తిప్పర్తి : మండలంలోని సిలార్‌మియాగూడెం గ్రామంలో ఇటీవల విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన జక్కలి వీరయ్య కుటుంబాన్ని సోమవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పరామర్శించి రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వీరయ్య కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటానని, పిల్లల చదువులకు సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, జూకూరి రమేష్, పాశం సంపత్‌రెడ్డి, బద్దం సుధీర్, యర్రమాద నరేందర్‌రెడ్డి, పల్లె ఎల్లయ్య, కిన్నెర అంజి, అబ్దుల్ రహీం, లొడంగి వెంకటేశ్వర్లు, చింతకుంట్ల సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు: మండలంలోని కొంపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు సంకు సర్వమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. సోమవారం ఆమె కుటుంబ సభ్యులను వెదిర పూలమ్మ ఫౌండేషన్ చైర్మన్ వెదిర మేఘారెడ్డి పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట వెదిర విజయేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు జాల వెంకన్న యాదవ్, బోయపర్తి లింగయ్య, బోయపర్తి ప్రసాద్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

128 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణంలో రెండు రోజులుగా రాత్రి వేళల్లో చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 128 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆపరేషన్ చబుత్ర ద్వారా శని, ఆదివారాల్లో అర్ధరాత్రి తనిఖీలు నిర్వహించామని, మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన వారితో కలిపి 250 మందికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. 97 మందిని కోర్టులో హాజరుపరుచగా వారికి మొత్తం రూ.లక్షా 19 వేల జరిమానా విధించారని తెలిపారు. 62 మందిపై పెట్టీ కేసులు నమోదు కాగా, 54 మందిని కోర్టులో హాజరుపరుచగా రూ.56 వేలు జరిమానా విధించారన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని 100 వాహనాలను సీజ్ చేసి రూ.3,51,665 జరిమానా వేసినట్లు తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి అపశృతులు జరగకుండా నిరంతరం తనిఖీలు చేస్తామని అన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి



నల్లగొండ టౌన్: నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు



చండూరులో..

నల్లగొండ టౌన్: పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నల్లగొండలోని సుభాష్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మతతత్వ విధానాలను ప్రోత్సహించే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు నలపరాజు సైదులు, కోట్ల అశోక్ రెడ్డి, కత్తుల యాదయ్య, పేర్ల సంజీవ, యాదగిరి రెడ్డి, దర్శనం ఎల్లమ్మ, కృష్ణయ్య, నరసింహ, తీగల ఎల్లమ్మ, జానమ్మ, శంకర్, చంద్రం, భిక్షం పాల్గొన్నారు.

సీపీఎం నిరసన ప్రదర్శన

నకిరేకల్ : డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ సోమవారం నకిరేకల్‌లో సీపీఎం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్లబ్యానర్‌తో నిరసన తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి రాచకొండ వెంకట్‌గౌడ్, చెన్నబోయిన నాగమణి, ఎరకల అంజయ్య, మర్రి వెంకటయ్య, వంటిపాక కృష్ణ, గురిజ స్వరూప, గింజల లక్ష్మీ, పాలడుగు పరమేష్, యానాల వెంకట్‌రెడ్డి, పన్నాల శశికళ, బండమీది యల్లయ్య, ఆదిమల్ల సుధీర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా మంత్రి పదవి నుంచి వైదొలగాలి

చండూరు : డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పి మంత్రి పదవి నుంచి వైదొలగాలని సీపీఎం మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ్య డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలకు ఖండిస్తూ సోమవారం సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో చండూరు చౌరస్తాలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విషయంలో ప్రధాని మోదీ స్పందించాలన్నారు. కార్యక్రమంలో చిట్టిమల్ల లింగయ్య, ఈరటి వెంకటయ్య, స్వామి, వెంకన్న, లక్ష్మయ్య, సాయం కృష్ణయ్య, సుమన్, రమేష్, అంజి, నర్సింహ, శేఖర్ పాల్గొన్నారు.

అమిత్‌షా చిత్రపటం దహనం

కేతేపల్లి: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానపరుస్తూ వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కేతేపల్లిలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట అమిత్‌షా చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు మాట్లాడుతూ అంబేద్కర్‌పై అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. అమిత్‌షాను వెంటనే మంత్రి వర్గం నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, నాయకులు సుంకరి సత్తయ్య, వంగూరి వెంకన్న, ఆదిమళ్ళ నాగయ్య, పెరిక మల్లయ్య, నీలం సైదులు, చెరుకు రమేష్, కర్ర బాలయ్య, గాదె సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

మర్రిగూడ : పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌పై అనుచితంగా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమిత్‌షా వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో నీలకంఠం రాములు, కొట్టం యాదయ్య, దామెర లక్ష్మీ, సల్వోజు రామలింగాచారి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న మత పెద్దలు

నల్లగొండ టూటౌన్: మత విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సరికాదని జమాయత్ ఉల్మా యేహింద్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హఫీజ్ పీర్ ఖాలిక్ అహ్మద్ అన్నారు. సోమవారం నల్లగొండలోని మీర్‌బాగ్ కాలనీ దారుల్ ఉల్ంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్రేకపూరిత ప్రసంగం, దేశానికి వ్యతిరేకంగా మాట్లాడకుండా చట్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మత స్థలాలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని, మైనార్టీలకు జనాభా నిష్పత్తి ప్రకారం రాజకీయ, సామాజిక ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. మతపర సలహాలు, మసీదులు, చర్చిలు, గురు ద్వారాల రక్షణకు 1991 చట్టం చేయబడిందన్నారు. ఆ చట్టం ప్రకారం అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదించాలని వచ్చే ఏడాది ఏప్రిల్ 26న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో హిందూ, ముస్లిం, దళితులను విభజించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జమాయత్ ఉలేమా, ఏ హింద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మౌలానా సయ్యద్ ఎహసానోద్దీన్, అధ్యక్షుడు మౌలానా సయ్యద్, మహమూద్, మత పెద్దలు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

నల్లగొండ టౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండలో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇళ్లు, ఇళ్ల స్థలాలను పేదలకు ఇంతవరకు ఇవ్వలేదన్నారు. ప్రతి మహిళకు రూ. 2500 ఇవ్వాలని కోరారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని పూర్తిచేసి నల్లగొండ మండలంలో ప్రతి ఎకరానికి నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దొండ కృష్ణారెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, మండల కార్యదర్శి నలపరాజు సైదులు, కొండ వెంకన్న, పోలె సత్యనారాయణ, బొల్లు రవీందర్, ఉప్పుల గోపాలు, గోలి నర్సింహ, మానుపాటి ఎల్లయ్య, ఏపూరి జానయ్య, కొత్త అంజయ్య, కండే యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

నల్లగొండ టూటౌన్: పట్టణంలో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ, సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని కోరుతూ అఖిలపక్ష నాయకులు సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా పానగల్‌కు మంజూరైన నిధులను దారి మళ్లించారని, మళ్లీ నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ కొండూరు సత్యనారాయణ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, మున్సిపల్ కౌన్సిలర్ వి.వెంకట్రాంరెడ్డి, గుండు వెంకటేశ్వర్లు, ముశం దశరథ, జి.కిషన్, నిమ్మనగోటి శ్రీను, పెరిక యాదయ్య, గిరి, కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

వైద్యాధికారికి..

కట్టంగూర్ : ఆశా వర్కర్లకు రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు పంజర్ల సైదులు సోమవారం కట్టంగూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి శ్వేతకు ఆశావర్కర్లతో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించనున్న ఆశావర్కర్ల బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి తవిటి వెంకటమ్మ, మండల కార్యదర్శి భూపతి రేణుక, చెరుకు జానకి, సీహెచ్ ధనలక్ష్మి, శ్రీదేవి, సునిత, రజిత ఉన్నారు.

ముగ్గులు వేసి సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన



ముగ్గులు వేస్తున్న మహిళా ఉద్యోగినులు

నల్లగొండ టౌన్: తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ ఎదుట 21వ రోజు ముగ్గులు వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు కంచర్ల మహేందర్, క్రాంతి కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొండ చంద్రశేఖర్, ఎమ్ నీలాంబరి, మహిళా అధ్యక్షురాలు గుమ్మల మంజులారెడ్డి, మహిళా కార్యదర్శి సావిత్రి, అసోసియేట్ ప్రెసిడెంట్ వి. సావిత్రి , కోశాధికారి పుష్పలత, సాయిలు, ఉపాధ్యక్షులు వెంకట్, జి వెంకటేశ్వర్లు, ఎర్రమల్ల నాగయ్య, ప్రచార కార్యదర్శి చందపాక నాగరాజు, ఎం.కృష్ణ, బి.రాజు, బంటు రవి, లలిత, కొండయ్య, యాదయ్య, యాట వెంకట్, జి వెంకటేశ్వర్లు, ధార వెంకన్న పాల్గొన్నారు.

చెర్వుగట్టులో వైభవంగా లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీపార్వతి జడలరామలింగేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం రాత్రి ఆలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సతీష్ శర్మ, సురేష్ శర్మ, శ్రీకాంత్ శర్మ, నాగయ్య శర్మ ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా కొనసాగాయి. అమావాస్య కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు, పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ ఈఓ నవీన్ కుమార్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

నల్లగొండ టౌన్: మోడల్ స్కూల్ బాలికల హాస్టళ్లలో పనిచేస్తున్న కేర్ టేకర్, ఏఎన్ఎం, కుక్కింగ్ వర్కర్స్‌కు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మోడల్ స్కూల్ బాలికల హాస్టళ్లలో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికుల జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాశాఖ సమగ్ర శిక్షలో భాగంగా టైప్ ఫోర్ కేజీబీవీ, మోడల్స్ స్కూల్ అటాచ్ బాలికల హాస్టళ్లలో కేర్ టేకర్, ఏఎన్ఎం, కుకింగ్ వర్కర్స్ 10 సంవత్సరాలుగా అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. రాసాల శ్రీను, కె.జానకమ్మ, శ్వేత, రాణి నాగలక్ష్మి, విజయ, ప్రమీల, నాగమణి, సైదమ్మ పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలి



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

నల్లగొండ క్రైం: పోలీస్ గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో సమగ్రంగా విచారణ జరిపి వేగంగా పరిష్కరిస్తూ ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశించారు. సోమవారం నల్లగొండలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డేలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 43 మంది బాధితులను ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం ఎస్పీ మాట్లాడారు. బాధితులకు సత్వర న్యాయం జరిగినప్పుడే పోలీస్ శాఖపై నమ్మకం కలుగుతుందన్నారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకోవాలన్నారు.

బెంచీలు అందజేత

మర్రిగూడ : మండలంలోని యరగండ్లపల్లి ప్రధాన కూడలి ఆలయాల వద్ద 60 సిమెంట్ బెంచీలను సోమవారం సామాజిక కార్యకర్త, కాంగ్రెస్ పార్టీ గ్రామ యువ నాయకుడు పులిమామిడి నరసింహారెడ్డి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కాకులవరం అశోక్‌రెడ్డి, మాడం వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

నకిరేకల్ : పట్టణంలోని పోలీస్ స్టేషన్‌ను సోమవారం రాత్రి నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తనిఖీ చేశారు. కేసుల వివరాలు అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందితో శాంతిభద్రతల పర్యవేక్షణపై సమీక్షించారు. ఆయన వెంట స్థానిక సీఐ రాజశేఖర్, ఎస్ఐ లచ్చిరెడ్డి ఉన్నారు.

పుస్తకం ఆవిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న యాదగిరిరెడ్డి

రామగిరి (నల్లగొండ): ఎన్జీ కళాశాలలో సోమవారం తెలుగు శాఖ ఆధ్వర్యంలో 'అడవిలో అన్వేషణ' పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాహితీవేత్త మేరెడ్డి యాదగిరిరెడ్డి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.సముద్రాల ఉపేందర్, తండు కృష్ణ కౌండిన్య, తెలుగుశాఖ అధ్యక్షుడు డా.వెల్దండి శ్రీధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎంజీయూ వాణిజ్య విభాగం అధిపతిగా సబీనా హెరాల్డ్

నల్లగొండ రూరల్: మహాత్మా గాంధీ యూనివర్సిటీ వాణిజ్య (కామర్స్) విభాగం అధిపతిగా డాక్టర్ సబీనా హెరాల్డ్‌ను నియమిస్తూ రిజిస్ట్రార్ అల్వాల రవి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. హెరాల్డ్ గతంలో ప్లేస్మెంట్ సెల్, ఎంటర్‌ప్రెన్యూ సెల్ డెరెక్టర్‌గా, అకడమిక్ ఆడిట్ సెల్ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణారెడ్డి, అధ్యాపకులు రమేష్, సరితలు సబీనా హెరాల్డ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

కొబ్బరికాయల టెండర్ కం వేలం వాయిదా

కనగల్: దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయం సమీపంలో ఏడాది కాలానికి కొబ్బరికాయలు అమ్మే హక్కులు పొందేందుకు సోమవారం జిల్లా ఎండోమెంట్ సహాయ కమిషనర్ కార్యాలయంలో టెండర్ కం బహిరంగ వేలాన్ని నిర్వహించారు. తిరుమలగిరికి చెందిన ఎం.సోమయ్య రూ.65 లక్షల 40 వేలకు అధికంగా పాట పాడారు. గత ఏడాదితో పోలిస్తే ఈ మొత్తం తక్కువ ఉండడంతో అధికారులు నిర్ణయం తీసుకోకుండా వాయిదా వేశారు. ఉన్నతాధికారులకు నివేదించి నిర్ణయం తీసుకుంటామని ఈఓ జయరామయ్య తెలిపారు.

ఇసుక రీచ్ ఏర్పాటుకు స్థల పరిశీలన

నార్కట్‌పల్లి : మండలంలోని అమ్మనబోలు గ్రామ సమీపంలో మూసీ వాగులో ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలాన్ని మైనింగ్ అధికారి ఆర్ బాబు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు సోమవారం పరిశీలించారు. పూర్తి నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్లు అధికారులు తెలిపారు. వారి వెంట మైనింగ్ అధికారులు రజని, ఆంజనేయులు ఉన్నారు.

హైస్కూల్లో గ్రంథాలయం ప్రారంభం

కట్టంగూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ, దాతల సహకారంతో సోమవారం గ్రంథాలయాన్ని క్లబ్ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందజేశారు. ఎంఈఓ అంజయ్య, మోహన్‌రెడ్డి, పాపిరెడ్డి, ప్రదీప్, ప్రభాకర్‌రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.